సూర్య నేటి దినపత్రిక www.suryaa.com
18వ వసంతంలోకి.. www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
4 PM www.suryaa.com
గురువారం
17-07-2025
పేజీలు: 02



గాల్లో ఉండగా ఇంజిన్ ఫెయిల్ అవ్వడంతో

## ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

అహ్మదాబాద్ ఘోర విమాన ప్రమాద ఘటన తర్వాత ఏ విమానానికి సంబంధించి ఏ చిన్న వార్త విన్న భయం కలుగుతోంది. ముఖ్యంగా నిత్యం విమానాల్లో ప్రయాణించే వారు అయితే ప్రాణాలు అరచేతిలో పట్టుకొని విమానాల్లో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలోనే మరో విమానం గాల్లో ఉండగానే ఇంజన్ ఫెల్యూర్ సమస్యను ఎదుర్కొంది. ఢిల్లీ నుండి గోవాకు వెళ్తున్న ఇండిగో విమానం బుధవారం దాని రెండు ఇంజిన్లలో ఒకటి విఫలమైనందున పూర్తి అత్యవసర పరిస్థితి మధ్య ముంబైలో ల్యాండ్ అయింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాత్రి 9.42 గంటలకు విమానం ల్యాండ్ అయిందని సమాచారం. పైలట్ రాత్రి 9.25 గంటలకు అలారం మోగించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశాడని ఎయిర్ పోర్ట్ అధికారులు తెలిపారు. ఢిల్లీ నుండి గోవాలోని మనోహర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళుతుండగా 6E 6271 విమానంలో సాంకేతిక లోపం గుర్తించారు పైలెట్. "విధానాలను అనుసరించి, విమానాన్ని దారి మళ్లించి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు" అని ఇండిగో ప్రతినిధి తెలిపారు.



## అలిపిరికి దగ్గరలో చిరుత సంచారం

గత కొంతకాలంగా తిరుమల శ్రీవారి భక్తులను చిరుత పులులు భయాందోళనలకు గురి చేస్తున్నాయి. గత కొంతకాలంగా పలు ప్రాంతాల్లో చిరుత పులులు నడకదారులకు దగ్గరలోనే కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. తాజాగా మరోసారి అలిపిరి జూ పార్క్‌కు సమీపంలోనే చిరుత సంచరించింది. గురువారం తెల్లవారు జామున 5.30 గంటల ప్రాంతంలో ఫారెస్ట్ విభాగం ఏర్పాటు చేసిన ఇనుపకంచెను దాటి జూపార్క్ రోడ్డుపైకి వచ్చింది. అక్కడి నుంచి ఓ ప్రైవేటు కంటి ఆసుపత్రి వరకు చేరుకుంది. రోడ్డుపక్కనే ఉన్న చిరుత పులిని చూసిన భక్తులంతా భయంతో పరుగులు పెట్టారు.పలువురు భక్తులు తమ సెల్‌ఫోన్లలో చిరుత పులిని వీడియో తీశారు. పలువురు భక్తులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. దాంతో వారు అక్కడికి చేరుకొని చిరుత కోసం గాలిస్తున్నారు.

# మహారాష్ట్రలో విలీనం కానున్న తెలంగాణలోని 14 గ్రామాలు



తెలంగాణ సరిహద్దుకు అనుకుని ఉన్న గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారానికి మహారాష్ట్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన అడుగు వేసింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఆదేశాల మేరకు సరిహద్దుకు చుట్టుపక్కల ఉన్న 14 గ్రామాలను మహారాష్ట్రలో విలీనం చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ నిర్ణయం వల్ల ఆయా గ్రామాల్లోని ప్రజల్లో ఆనందం నెలకొంది.ఈ గ్రామాల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా మహారాష్ట్రలో విలీనం కావాలని కోరుకుంటున్నారు. పరిపాలనా సేవలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి మౌలిక వసతుల కోసం వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం దొరికే సూచనలు కనిపించటంతో ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో, బెళగావి వంటి ఇతర సరిహద్దు ప్రాంతాలపై కూడా చర్చలు మళ్లీ ఊపందుకున్నాయి.ఈ 14 గ్రామాలు చంద్రపూర్ జిల్లాలోని రాజూరా, జివతి తాలూకాకు చెందినవి. ఈ గ్రామాల విలీనానికి సంబంధించిన పరిపాలనా ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ముంబైలోని విధాన భవన్‌లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బావనకులే అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాజూరా ఎమ్మెల్యే దేవరాజ్ భోంగళే, గ్రామాల ప్రజా ప్రతినిధులు, చంద్రపూర్ కలెక్టర్ వినయ్ గౌడ హాజరయ్యారు. ఈ భేటీలో ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలను స్పష్టంగా మంత్రి ముందు ఉంచారు. మంత్రి బావనకులే ఈ సమస్యలపై వెంటనే స్పందిస్తూ, అవసరమైన పరిపాలనా చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇది గ్రామస్తుల ఆశలను బలపరిచే ఒక అభివృద్ధి సూచికగా పరిగణిస్తున్నారు. ముఖ్యమంత్రుల సూచనలతో, త్వరలోనే ఈ 14 గ్రామాల మహారాష్ట్రలో అధికారిక విలీనానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. దీనివల్ల ప్రజలకు అన్ని ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతులు లభ్యమవుతాయి. ఇది కేవలం పరిపాలనా చర్య మాత్రమే కాకుండా, సరిహద్దు ప్రాంత ప్రజల ఆకాంక్షలకు ప్రభుత్వం ఇచ్చిన న్యాయ సమాధానంగా భావిస్తున్నారు.

## మందెక్కువై పామును కొరికి తినేశాడు



ఉత్తరప్రదేశ్‌లోని బండా జిల్లాలో ఆశ్చర్యం కలిగించే ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఓ యువకుడు పామును కొరికి తినేశాడు. ఈ ఘటన బాబేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని హర్దౌలి గ్రామంలో జరిగింది. స్థానికంగా నివసించే 35 ఏళ్ల అశోక్ మద్యం సేవించి ఇంట్లో ఉన్న సమయంలో అకస్మాత్తుగా ఇంట్లోకి వచ్చిన పామును చూసాడు. అప్పటికే మత్తులో ఉన్న అతను ఏ మాత్రం ఆలోచించకుండా ఆ పామును పట్టుకొని నోటికి తీసుకుని కొరికి తినేశాడు. ఈ దృశ్యం చూసిన అతని తల్లి ఒక్కసారిగా కేకలు వేసింది. వెంటనే ఇతర కుటుంబ సభ్యులు వచ్చి అశోక్‌ను అడ్డుకున్నారు. అతనికి నీళ్లు తాగించడంతో పాటు నోటిలో ఉన్న పాము ముక్కలను తీసేశారు. అనంతరం అతన్ని తక్షణమే బాబేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి ప్రస్తుతం స్థిరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. తిన్న పాము విషపూరితమైనది కాకపోవడం వల్ల అతను ప్రాణాపాయానికి చేరకపోయినట్టు తెలిపారు. ఈ సంఘటన గ్రామంలో తెగ చర్చకు దారి తీసింది. వైద్యుల పర్యవేక్షణలో ప్రస్తుతం అశోక్ చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం గురించి పోలీసులు ఆరా తీశారు.



## గ్లామరస్ లుక్‌తో రషా తడానీ

రవీనా టాండన్ కూతురు రషా తడానీ తన అందంతో మరోసారి వార్తల్లో నిలిచింది. ఆ నటి ఎర్ర దేవకన్యలా తన అందాన్ని వెలిగిస్తూ కనిపించింది.రాషా తడానీ తన గ్లామరస్ లుక్ తో ఎప్పుడూ అభిమానుల హృదయాలను గెలుచుకుంటుంది. ఈ నటి మరోసారి సోషల్ మీడియా ఉష్ణోగ్రతను పెంచుతోంది. రషా రెడ్ దేవకన్యలా కెమెరా ముందు పోజులిచ్చింది. క్రింద ఇచ్చిన ఫోటోలను చూడండి...రాషా తడానీ రెడ్ దేవకన్యలా ఇంటర్నెట్ లో సంచలనం సృష్టించింది. నటి యొక్క ఈ చిత్రాలు అప్‌లోడ్ చేసిన వెంటనే వైరల్ కావడం ప్రారంభించాయి.ఈ చిత్రాలలో రాషా యొక్క అందమైన లుక్ కనిపించింది. నటి ఎర్రటి నెట్ టాప్ లో సిజ్లింగ్ పోజ్ ఇచ్చింది. రాషా తడి జుట్టు, ఎర్రటి లిప్ స్టిక్ మరియు రక్తంతో నిండిన కళ్ళు ఆమె లుక్ ని మరింత పెంచాయి.




## 125 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్

బీహార్‌లో ఎన్నికల వేడి మొదలైంది. ఈ ఏడాది చివరికల్లా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో అన్ని ప్రధాన పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఇక ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న నితీశ్ కుమార్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారాన్ని నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు వరాల జల్లు కురిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు, పింఛన్లు వంటి కీలక హామీలు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా సీఎం నితీశ్ కుమార్ మరో కీలక పథకాన్ని ప్రకటించారు. 125 యూనిట్ల లోపు కరెంటు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అందుబాటు ధరల్లోనే విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.



## రెండోసారి భారత్‌కు బోల్ట్

జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ భారత పర్యటనకు రానున్నాడు. ఈ ఏడాది సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు బోల్ట్ భారత్‌లోని ఢిల్లీ, ముంబైలో పర్యటించనున్నాడు. ఓ ప్రమోషనల్ ఈవెంట్ కోసం తాను భారత్‌కు వస్తున్నానని స్వయంగా అతడే 'ఎక్స్' ద్వారా వెల్లడించాడు. బోల్ట్ భారత పర్యటనకు రావడం ఇది రెండోసారి. 2014లో అతడు.. యువరాజ్ సింగ్‌తో కలిసి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఆడేందుకు ఇక్కడికి వచ్చాడు.



## ఈగ నా కెరీర్‌లో బెస్ట్ మూవీ

'జూనియర్' ఈవెంట్ లో యాంకర్ సుమ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన రాజమౌళి.. తన కెరీర్ లో బెస్ట్ మూవీ 'ఈగ' అని తెలిపారు. RRR షూటింగ్ సందర్భంగా 'స్టూడెంట్ నెం.1' లొకేషన్స్ కి వెళ్లి జూనియర్ ఎన్టీఆర్ తో తానొక ఫోటోని రీక్రియేట్ చేసినట్లు చెప్పారు. 'సై' తనకు ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అని, 'సింహాద్రి' తర్వాత మాస్ సినిమాలే తీస్తాడనే ఎక్స్ పెక్టేషన్స్ ను కంప్లీట్ గా బ్రేక్ చేస్తూ తీసిన యూత్ ఫుల్ చిత్రమని అన్నారు. ఒక మూసలో వెళ్లకుండా నచ్చినట్లు సినిమా తీయొచ్చని తెలియజెప్పిందన్నారు. "సాయి కొర్రపాటి 'జూనియర్' సినిమా మొదలుపెట్టినప్పుడు, ఒక మంచి కథతో ఒక చిన్న సినిమా తీస్తున్నారు అని అనుకున్నాను. కానీ శ్రీలీల, జెనీలియా, రవి చందర్.. ఇలా కాస్టింగ్ పెద్దదిగా మారుతూ వచ్చింది. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, పీటర్ హెయిన్స్ ఫైట్స్.. ఇలా ఒక్కొక్కరు యాడ్ అవుతూ ఒక పెద్ద సినిమాకి తగిన టీమ్ ని తీసుకున్నారు. ఒక చిన్న సినిమాని పెద్ద సినిమా చేసారు. బడ్జెట్ అని కాదు, 1000కి పైగా స్క్రీన్స్ లో రిలీజ్ అవుతోంది. ఈ సినిమా చూడాలనే ప్రేక్షకులలో కలిగిన ఆసక్తి కారణంగానే ఈ స్థాయిలో రిలీజ్ అవుతోంది" అని రాజమౌళి అన్నారు.

సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com

# గుండెపోటుతో తొమ్మిదేళ్ల చిన్నారి మృతి



రాజస్థాన్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. నాలుగో తరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలిక ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది. చిన్నారి గుండెపోటు లక్షణాలతో మరణించినట్లు వైద్యులు గుర్తించారు. ప్రాచి కుమావత్ (9) సికార్‌లోని దంతా పట్టణంలో గల ఓ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. జలుబు ఉండటంతో గత రెండు, మూడు రోజులుగా చిన్నారి స్కూల్‌కు వెళ్లలేదు. సోమవారం పాఠశాలకు వెళ్లింది. చాలా యాక్టివ్‌గా మార్నింగ్ ప్రేయర్‌లో కూడా పాల్గొంది. అప్పటి వరకూ చాలా ఉత్సాహంగా, ఆరోగ్యంగా కనిపించిన చిన్నారి మధ్యాహ్నం లంచ్‌కు కూర్చున్న తర్వాత ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో అప్రమత్తమైన పాఠశాల యాజమాన్యం చిన్నారిని హుటాహుటిన సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. అయితే, చిన్నారికి పల్స్ లేదని, బ్లడ్ ప్రెషర్ పడిపోయిందని, ఊపిరి ఆడటం లేదని అక్కడి వైద్యులు తెలిపారు. బాలికకు గుండెపోటు లక్షణాలు కనిపిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బాలికను వేరే ఆసుపత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. బాలిక ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధరించారు. బాలిక ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



## డ్రంక్ & డ్రైవ్లో 1,300 మందికి జైలు శిక్ష

మింట్ కాంపౌండ్‌లో ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. జూన్ నెలలో స్కూల్ బస్సులపై నిర్వహించిన తనిఖీల్లో 35 మంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు బయటపడిందన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 30 వేల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని, అందులో 1,300 మందికి జైలు శిక్షలు విధించామని చెప్పారు.




## గ్రేటర్ హైదరాబాద్ స్కూల్స్ ఛాంపియన్స్ 2025

ఈ నెల 12 న జింఖానా గ్రౌండ్స్ లో క్రీడా పోటీలు నిర్వహించిన రంగారెడ్డి డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ .వివిధ పోటీలు లో పాల్గొన చిన్నారులు. బాల్ త్రో గేమ్ లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన 8 ఏళ్ల చిన్నారి సిఎస్ఎన్ఎస్ మాన్విత.ఆమె సికింద్రాబాద్ లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ లో చదువుకుంటుంది. బాల్ త్రో గేమ్ లో మొదటి స్థానంలో నిలిచి అవార్డు ను అందుకున్న మాన్విత.



## బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ కవిత షాక్!

బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ కవిత ఊహించని షాక్ ఇచ్చారు. ఇంటిపార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని.. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తున్నారు.. అది తప్పు అని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వాళ్ళు మెల్లగా తన దారికి రావాల్సిందే అని చెప్పారు. ఇందుకోసం వారు నాలుగు రోజులు టైం తీసుకుంటారేమో అంతే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని రేవంత్ సర్కార్ కు బహిరంగ మద్దతును ప్రకటించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్ కు తాను సపోర్ట్ చేసినట్లు చెప్పారు. తనపై మల్లన్న చేసిన కామెంట్స్ కు బీఆర్ఎస్ పార్టీ రియాక్ట్ కాలేదని.. దానిని వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. ఈరోజు హైదరాబాద్ లోని తన నివాసంలో మీడియా చిట్ చాట్ లో ఎమ్మెల్సీ కవిత ఈ వ్యాఖ్యలు చేశారు.



# అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్

## జమ్ముకశ్మీర్‌లో భారీ వర్షాలు..

హిందువులు తమ జీవితంలో ఒక్కసారైనా దర్శించుకోవాలనుకునే ఆధ్యాత్మిక కేంద్రాల్లో అమర్‌నాథ్ ఒకటి. హిమాలయ కొండల్లో కొలువుదీరిన మంచులింగాన్ని దర్శించుకుని పునీతులవుతారు. ఈ నెల 2న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర అనేక ఆటంకాల నడుమ కొనసాగుతున్నది. తాజాగా జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో మరోసారి వాయిదా పడింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పహల్గామ్, బాల్టాల్ మార్గాల నుంచి కొనసాగుతున్న యాత్రను ఒక రోజు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. కుండపోత వర్షం కారణంగా ట్రెక్కింగ్ మార్గాలు జారడంతోపాటు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నదని, ముందు జాగ్రత్తచర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. జూలై 18న యాత్ర తిరిగి ప్రారంభమవుతుందన్నారు. భారీ వర్షాల కారణంగా రెండు మార్గాల్లో ఉన్న ట్రాక్‌లను పునరుద్ధరించేందుకు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ తన సిబ్బంది, యంత్రాలను భారీగా మోహరించింది. శుక్రవారం రెండు బేస్ క్యాంపులను యాత్ర ప్రారంభమయ్యే సమయానికి ట్రాక్‌లను బాగుచేయాలని అధికారులు వెల్లడించారు.



## కూలీని కోటీశ్వరుడిని చేసిన ఆరు రూపాయలు

ఎప్పుడు ఎవరికీ ఎలా అదృష్టం కలిసి వస్తుందో చెప్పలేం, ఒక్కోసారి రాత్రికి రాత్రే కొందరు కోటీశ్వరులు అవుతారు. ఓ కూలీ ఆరు రూపాయలు పెట్టి లాటరీ టికెట్ కొన్నాడు. ఆ టికెట్ అతడిని కోటీశ్వరుడిని చేసింది. ఆ టికెట్ అతడిని కోటీ రూపాయలు గెలుచుకునే విధంగా చేసింది. పంజాబ్ రాష్ట్రం మెగా జిల్లాకు చెందిన జస్మాయిల్ సింగ్ అనే వ్యక్తి ఇటుక బట్టీలో కూలీగా పని చేసేవాడు. ఫిరోజ్‌పూర్ జిల్లాలోని జిరాలో ఆరు రూపాయలు పెట్టి 50ఇ42140 అనే నంబర్ లాటరీ టికెట్ కొన్నాడు. ఆయన టికెట్ కొన్ని 24 గంటలకే నిర్వహకులు పోన్ చేసి కోటి రూపాయలు గెలుచుకున్నారని అతడికి సమాచారం ఇచ్చారు. ఈ వార్త తాను నమ్మలేకపోతున్నానని జస్మాయిల్ ఆనందం వ్యక్తం చేశాడు. వచ్చిన సొమ్ములతో రూ.25 లక్షల అప్పు తీర్చుకోవడంతో పాటు మిగిలిన డబ్బులు పిల్లల భవిష్యత్ కోసం ఉపయోగిస్తానని వివరణ ఇచ్చాడు. ముగ్గురు పిల్లలకు మంచి విద్యను అందిస్తానని చెప్పారు. జస్మాయిల్ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఇప్పుడు తమ పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తామని జస్మాయిల్ భార్య విర్పాల్ కౌర్ వెల్లడించారు. ఇలాంటి రోజు వస్తుందని తాను ఎప్పుడు ఊహించలేదని కౌర్ పేర్కొన్నారు. ఫిరోజ్ పూర్ లో గతంలో నలుగురు లాటరీ టికెట్ గెలిచి కోటీశ్వరులు అయ్యారని నిర్వహకులు వెల్లడించారు.

## రాజేంద్ర నగర్‌లో టమాటా లారీ బోల్తా

రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ లో రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం ఉదయం డైరీ ఫామ్ చౌరస్తా వద్ద టమాటా లోడుతో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. టమాటా బాక్సులు రోడ్డు పడడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించారు. రోడ్డపై పడిన టమాటాలకు ఒక వైపు కుప్పగా పోశారు. అతివేగంగాతోనే టమాటా లారీ బోల్తాపడిందని పోలీసులు వెల్లడించారు. డైవర్ల స్వల్పంగా గాయపడినట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బిహార్‌లో ఒవైసీకి షాక్



బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎంఐఎం పార్టీకి గట్టి షాక్ తగిలింది. కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిలో చేరేందుకు అసదుద్దీన్ ఆసక్తి చూపించారు. కానీ, కూటమిలో ఎంఐఎంని చేర్చుకునేందు కు ఆ పార్టీలో విముఖత వ్యక్తం చేశాయి. ఎంఐఎం.. బీజేపీ బీ అంటూ కాంగ్రెస్ విమర్శలు చేస్తోంది. ఆ పార్టీతో పొత్తు అస్సలు వద్దంటూ బహిరంగంగానే చెబుతోంది. ప్రస్తుతం ఈ అంశం బిహార్‌లో కొత్త రాజకీయ చర్చకు దారితీసింది. ఎంఐఎంపై కాంగ్రెస్ ఎంపీ అఖిలేష్ ప్రసాద్ సింగ్ చేసిన విమర్శలకు మద్దతు ఇస్తూ ఆర్జేడీ అధికార ప్రతినిధి మృత్యుంజయ్ తివారీ ఒవైసీ పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ పార్టీని బీజేపీ B టీంగా అభివర్ణించారు. "ఒవైసీ పార్టీ లౌకిక ఓట్లను విభజించడానికి, తద్వారా మతతత్వ శక్తులకు ప్రయోజనం చేకూర్చడానికి నిరంతరం కృషి చేస్తోంది" అని తివారీ అన్నారు. "వారి గత చరిత్రే దానికి సాక్ష్యం. మేం హైదరాబాద్ ఎన్నికల్లో పోటీ చేయం, మరి ఒవైసీ బీహార్‌కు ఎందుకు వస్తున్నారు? ఆయన నిజంగా లౌకిక శక్తులకు మద్దతు ఇవ్వాలనుకుంటే, తన పార్టీ ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేయదని ప్రకటించాలి." అని అన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది




తెలంగాణ ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేసింది. రాష్ట్రంలో 31 జెడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని పేర్కొంది. అదేవిధంగా, 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు తెలిపింది.ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలను ఖరారు చేసింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల కాలపరిమితి గత ఏడాది ప్రారంభంలో ముగిసింది.



## హాట్‌గా ఆకాంక్ష పూరి

భోజ్‌పురి నటి ఆకాంక్ష పూరి తన తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో హాట్ హాట్‌గా కనిపించింది. ఆకాంక్ష ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన గులాబీ రంగు దుస్తులలో కొన్ని హాట్ ఫోటోలను షేర్ చేసింది, అందులో ఆమె బోల్డ్ మరియు గ్లామరస్ స్టైల్ చూడదగ్గది.పింక్ రంగు దుస్తులతో మ్యాచింగ్ నెయిల్ పాలిష్ మరియు ఓపెన్ హెయిర్ కూడా ఆమె గ్లామరస్ లుక్‌కు జోడించాయి. అభిమానులు ఆమె ఈ ఫోటోపై ప్రేమను కురిపిస్తున్నారు మరియు వ్యాఖ్య విభాగంలో ఫైర్ మరియు హార్ట్ ఎమోజీల వర్షం కురిపిస్తున్నారు.అభిమానులు ఈ చిత్రాలను లైక్ చేస్తున్నారు. సోషల్ మీడియాలోని వినియోగదారులు ఆమెను 'అద్భుతం', 'అందమైన' మరియు 'అద్భుతం' అని పిలుస్తూ ప్రశంసించారు.